క్లుప్తంగా

నేలకొరిగిన హోర్డింగులు, చెట్లు



ప్రత్తిపాడు: వాతావరణంలోని మార్పులతో బుధవారం ప్రత్తిపాడులో అకాల వర్షం కురిసింది. భారీ ఈదురుగాలు పెద్ద పెద్ద శబ్దాలతో ఉరుములు, మెరుపులతో గంటల వ్యవధి వర్షం కురిసింది. దీంతో ప్రత్తిపాడు నుంచి పెదనందిపాడు వెళ్లే రోడ్డులోని హోర్డింగులు మెయిన్ రోడ్డుపై నేలకొరిగాయి. గుంటూరు పర్చూరు పాతమద్రాసు రోడ్డు పక్క చెట్లు కూడా నేలవాలాయి. అప్రమత్తమైన ప్రత్తిపాడు ఎస్ఐ కె.నాగేంద్ర సిబ్బందితో రోడ్లపై అడ్డుగా ఉన్న హోర్డింగులు, చెట్లను తొలగించారు. ట్రాఫిక్‌కు అంతరాయం చోటుచేసుకోకుండా చర్యలు తీసుకున్నారు.

భావన్నారాయణుడి తెప్పోత్సవం

పొన్నూరు: పట్టణంలోని శ్రీ సుందరవల్లీ రాజ్యలక్ష్మీ సమేత సాక్షి భావన్నారాయణ స్వామి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. కార్యక్రమాల్లో భాగంగా బుధవారం స్వామివారు వైకుంఠ వారసుడి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి బ్రహ్మసరోవరంలో సుందరవల్లీ రాజ్యలక్ష్మీ సమేత సాక్షి భావన్నారాయణ స్వామివారి తెప్పోత్సవం ఘనంగా నిర్వహించారు. అనంతరం ద్వాదశ ప్రదక్షిణలు, పర్యంకోత్సవం, ఏకాంతసేవ నిర్వహించారు. భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సీబీఎస్ఈ పరీక్షల్లో ప్రతిభ



పెదకాకాని: సెయింట్ జోసెఫ్ హైస్కూల్ విద్యార్థులు సి.బి.ఎస్.ఇ పదో తరగతి పరీక్షల్లో అద్భుత విజయాన్ని సాధించారని ప్రిన్సిపాల్ సిస్టర్ సంధ్యారాణి అన్నారు. ఈనెల 13న విడుదలైన ఫలితాల్లో 113 మంది తమ విద్యార్థులు పరీక్షలు రాయగా అందరూ ఉత్తీర్ణత సాధించారని ఆమె అన్నారు. నవనీత్ 500లకు 468 మార్కులు సాధించి ప్రథమ స్థానం సాధించారని తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనపరచిన విద్యార్థులను బుధవారం ఆమె సత్కరించారు.

డ్రైనేజీ నిర్మాణానికి కృషి

చేబ్రోలు: మండలంలోని వీరనాయకునిపాలెంలో డ్రైనేజీ సమస్యను పరిష్కరించనున్నట్లు గ్రామ సర్పంచ్ యర్రాకుల అనిత కుమారి, పంచాయతీ కార్యదర్శి సుజనలు బుధవారం తెలిపారు. గ్రామంలో పంచాయతీ కార్యాలయం ఎదురుగా మురుగునీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో వారు పారిశుద్ధ్య సిబ్బందితో బ్లీచింగ్ చల్లించారు. ఇటీవల 'సాక్షి'లో వచ్చిన కథనంపై జిల్లా ఉన్నతాధికారులు స్పందించి సమస్యపై నివేదికను అందజేయాలని స్థానిక సిబ్బందికి ఆదేశాలు ఇచ్చారు. దీంతో మురుగునీరు తొలగించడానికి కాలువలను నిర్మించి పూర్తిచర్యలు తీసుకోనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

ప్రాథమిక హక్కుల రక్షణ బాధ్యత కోర్టులదే!

లక్ష్మీపురం: ప్రజల ప్రాథమిక హక్కులకు రక్షణ కల్పించటం కోర్టుల విధి అని ఆ మేరకు న్యాయ సమీక్షాధికారాన్ని వినియోగిస్తున్నాయంటే రాజ్యాంగ పరిధికి లోబడి పని చేస్తున్నట్లు అర్థమని విద్యావేత్త ఈ.చంద్రయ్య అన్నారు. గుంటూరు అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం చర్చ కార్యక్రమం నిర్వహించారు. సీనియర్ అధ్యాపకులు సి.సుబ్బారెడ్డి మాట్లాడుతూ శాసన నిర్మాణ అధికారం చట్ట సభలకు మాత్రమే ఉన్న మాట వాస్తవమని, అయితే ఆ చట్టాలు రాజ్యాంగ బద్ధంగా ఉన్నాయా లేవా అని సమీక్షించే గురుతర బాధ్యత న్యాయ వ్యవస్థ భుజస్కంధాలపై ఉంచిందని చెప్పారు.

రాష్ట్ర క్యారమ్స్ ఛాంపియన్ రవీంద్రారెడ్డికి అభినందనలు



గుంటూరు వెస్ట్(క్రీడలు): విశాఖలో నిర్వహించిన ప్రథమ ఆంధ్ర రాష్ట్ర ర్యాంకింగ్ క్యారమ్స్ టోర్నీ విజేతగా జిల్లాకు చెందిన బి.రవీంద్రారెడ్డి నిలిచాడని ఆంధ్ర క్యారమ్స్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ అబ్దుల్ జలీల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత 20 ఏళ్ల నుంచి ఈ ఘనత సాధించిన తొలి వ్యక్తిగా నిలిచాడని కొనియాడారు. ఈ సందర్భంగా రవీంద్రారెడ్డిని తనతోపాటు జిల్లా క్యారమ్స్ చీఫ్ ప్యాట్రన్ యాగంటి దుర్గారావు, అధ్యక్షులు ఎంకేవీ ప్రసాద్, ఉపాధ్యక్షులు పాలమని శ్రీనివాసరావులు అభినందించారని తెలిపారు.

నిరుపయోగంగా కియోస్క్ యంత్రాలు

- రైతు సేవా కేంద్రాల్లో కియోస్క్ యంత్రాలు నిరుపయోగం
- మెరుగైన సేవలకు నోచుకోని రైతన్నలు

చేబ్రోలు: అన్నదాతలకు మెరుగైన సేవలు అందించాలనే ఉద్దేశంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలు (ప్రస్తుతం రైతు సేవా కేంద్రాలు) ఏర్పాటు చేసింది. వారికి నిరంతర సేవలే లక్ష్యంగా కియోస్క్ యంత్రాలను ప్రవేశపెట్టింది. కానీ ప్రస్తుత కూటమి ప్రభుత్వ నిర్వాహకంతో కియోస్క్ యంత్రాలు అలంకార ప్రాయంగా మారాయి. వైఎస్సార్‌సీపీ పాలనలో 2021 జూలైలో ఆర్‌బీకేలను ప్రారంభించారు. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా రైతుల ఇంటి ముంగిటకే సేవలు అందించాలనే లక్ష్యంతో వీటికోసం రూ.లక్షలు వెచ్చించారు. రైతుల వద్దకే అన్ని రకాల సేవలు అందించడం వారికి వరంలా మార్చింది. కానీ దీనిని కూటమి ప్రభుత్వం నీరుగార్చింది.

మండలంలో 17 పరికరాలు..

విత్తనం నుంచి పంట విక్రయాల వరకు అన్నదాతలకు ప్రతి అడుగులో అండగా నిలబడాలనే సదాశయంతో దీనిని వైఎస్సార్ సీపీ ఏర్పాటు చేసింది. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అవసరమైన రైతులు ఈ కేంద్రాల వద్దకు వచ్చి సిబ్బందికి తెలియజేస్తారు. కియోస్క్ యంత్రం ద్వారా సిబ్బంది ఆన్‌లైన్‌లో నమోదు చేస్తే ఎవరికి ఏ రకం కావాలో రప్పించే పరిస్థితి ఉండేది. చేబ్రోలు మండలంలో 17 రైతు భరోసా కేంద్రాల్లో 17 కియోస్క్ యంత్ర పరికరాలు ఉన్నాయి. ప్రస్తుతం చాలా చోట్ల కియోస్క్ యంత్రాలు పనిచేయటం లేదు. దీంతో డిజిటల్ విధానంలో నూతన ఆవిష్కరణలతో ఏర్పాటు చేసిన ఈ యంత్రాలు అలంకార ప్రాయంగా దర్శనమిస్తున్నాయి. ఖచ్చితమైన సమాచారం, ఫలితాలతో నాడు రైతులకు వ్యవసాయశాఖ అన్ని విధాల సేవలందించింది. కానీ కూటమి ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలను నిరీర్యం చేసే దిశగా అడుగులు వేస్తోందని పలువురు రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తొలుత రైతు సేవా కేంద్రాలుగా పేరు మార్చి నేడు సేవలు కూడా అందించకుండా కర్షకులను ఇబ్బంది పెడుతోంది.



చేబ్రోలు మండలంలో అలంకార ప్రాయంగా కియోస్క్ యంత్రం



మంచాల రైతు సేవా కేంద్రంలో పనిచేయని కియోస్క్ యంత్రం

మూలన చేరుతున్న వైనం..

కియోస్క్ యంత్రాల ద్వారా వాతవరణంలో మార్పులు తెలుసుకొని అందుకు అనుగుణంగా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టే వెసులుబాటు అందుబాటులో ఉండేది. పంట ఉత్పత్తుల మద్దతు ధరలు కూడా ఈ యంత్రాల ద్వారా రైతులు తెలుసుకొనే వారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో కియోస్క్ యంత్రాలు మూలకు చేరుకున్నాయి. గతంలో రైతులకు రైతు భరోసా కేంద్రాల ద్వారా ఎరువులు పూర్తి స్థాయిలో పంపిణీ చేసేవారు. ప్రస్తుతం రైతులు ప్రైవేటు డీలర్ల వద్ద అధిక ధరలకు ఎరువులు కొనుగోలు చేసుకుంటున్నారు. ఆర్బీకేలను రైతు సేవా కేంద్రాలుగా మార్చినా సేవల కొనసాగింపులో మాత్రం కూటమి ప్రభుత్వం వివక్ష చూపిస్తోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ముద్రణ లేకుండా చేయడం కోసం ఆర్బీకేల సేవలకు స్వస్తి పలికింది. ఫలితంగా ఆర్బీకేల లక్ష్యం నీరుగారింది. ఆయా కేంద్రాల్లోని సిబ్బందిని సర్వేలు, పింఛన్ల పంపిణీ అంటూ బయటకు పంపిస్తుంది. అన్నదాతలకు అందుబాటులో లేకుండా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోంది.

యంత్రాలు పనిచేయడం లేదు..

చేబ్రోలు మండలంలో మొత్తం 17 రైతు సేవా కేంద్రాల్లో కియోస్క్ యంత్రాలు ఉన్నాయి. ప్రస్తుతం అవి ఉపయోగంలో లేవు. సాంకేతిక సమస్యలతో కియోస్క్ యంత్రాలు ఉన్నాయి. ప్రస్తుతం మొబైల్ యాప్‌లతో కియోస్క్‌లో ఉన్న సేవలను ఎవరికీ ఇబ్బందులు కలుగకుండా రైతులకు అందిస్తున్నాం.

–బి.శ్రీనివాస నాయక్, ఏవో, చేబ్రోలు

ప్రతి గ్రామంలో పార్టీని బలోపేతం చేయాలి



కార్యకర్తలతో మాట్లాడుతున్న బలసాని కిరణ్‌కుమార్

ప్రత్తిపాడు: నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలోనూ వైఎస్సార్‌సీపీని బలోపేతం చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బలసాని కిరణ్ కుమార్ అన్నారు. గుంటూరు రూరల్ మండలం ఏటుకూరులోని పార్టీ కార్యాలయంలో బుధవారం పార్టీ శ్రేణులతో ఆయన సమావేశమయ్యారు. పార్టీ పటిష్టమయ్యేందుకు తీసుకోవాల్సిన విధివిధానాలను నాయకులకు వివరించారు. గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిలో పార్టీని బలపరచాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో పార్టీ కోసం కష్టపడాలన్నారు. నాయకులు, కార్యకర్తలకు ఏ చిన్న కష్టం తలెత్తినా నేను అండగా ఉంటానని కిరణ్‌కుమార్ క్యాడర్‌కు భరోసానిచ్చారు. పలు గ్రామాల నాయకులు, కార్యకర్తలు కిరణ్‌కుమార్‌కు తమ సమస్యలను విన్నవించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువుల తయారీపై శిక్షణ



మహిళలకు ఇస్తున్న శిక్షణ కిరణ్మయి

ప్రత్తిపాడు: హోం కంపోస్టుతో మహిళలు ఇళ్ల వద్దనే కూరగాయల మొక్కలను పెంచుకోవచ్చని కాకుమాను ఏవో కె.కిరణ్మయి అన్నారు. మండల కేంద్రం కాకుమానులోని రైతు సేవా కేంద్రంలో బుధవారం డ్వాక్రా మహిళలకు హోం కంపోస్ట్‌పై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గృహాల్లోని వంటింటి నుంచి వచ్చే కూరగాయల పొట్టు, ఇతర వ్యర్థాలతో సహజ సిద్ధమైన సేంద్రియ ఎరువును తయారు చేసుకోవచ్చని చెప్పారు. ప్రతి ఒక్కరూ కుటుంబ సభ్యుల ఆరోగ్యం కోసం ఇంటి వద్దనే హోం కంపోస్ట్ తయారు చేసుకోవాలని సూచించారు. మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో రైతు సేవా కేంద్రాల్లో రానున్న రెండు రోజుల్లో హోం కంపోస్టుపై మహిళలకు శిక్షణ ఇవ్వనున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో వెలుగు సీసీ రాములమ్మ, డ్వాక్రా మహిళలు, వీఏఏలు పి.శ్వేత, డి.షణ్ముఖ, ఎం.శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల సమ్మె



శిబిరాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల జిల్లా ఉపాధ్యక్షురాలు జి.వనజ

లక్ష్మీపురం: వైద్య ఆరోగ్య శాఖ ఎన్‌హెచ్‌ఎంలో ఆరేళ్ల నుంచి సీహెచ్‌ఓలుగా గ్రామీణ ప్రాంతాలలో వైద్య సేవలు అందిస్తున్నాం అని, గత రెండు సంవత్సరాల నుంచి మా సమస్యలు పరిష్కారం కాకపోవడంతో జిల్లాల పరిధిలో నిరవధిక సమ్మె చేస్తున్నట్లు కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల జిల్లా ఉపాధ్యక్షురాలు జి.వనజ పేర్కొన్నారు. గుంటూరు జిల్లా కలెక్టరేట్ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టిన కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల సమ్మె బుధవారానికి 17వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెండు సంవత్సరాలుగా పేరుకుపోయి ఉన్న సమస్యల పరిష్కారం కొరకు సమ్మె బాట పట్టడం జరిగిందన్నారు. ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ఉద్యోగులైనటువంటి కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల ముఖ్యమైన డిమాండ్ అయిన 23శాతం వేతన సవరణ చేయాలని కోరారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణరావు మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు అబ్బుస్, షరీఫ్. రవితేజ. జయంతి, డి.ప్రవళిక, హర్ష పాల్గొన్నారు.

అంతర్గత డ్రెయిన్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలి



డ్రెయిన్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలో అంతర్గత డ్రెయిన్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, చెత్త వేసే వారికి అపరాధ రుసుం విధించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. పాత గుంటూరు, కొత్తపేట, సీతానగర్ తదితర ప్రాంతాల్లో కమిషనర్ బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజారోగ్య విభాగం కార్మికులు తమకు కేటాయించిన ఇళ్ల నుంచి నూరుశాతం చెత్త సేకరణ చేయడం ద్వారా ప్రజలు రోడ్ల మీద, కాలువల్లో వ్యర్థాలు వేయడం తగ్గుతుందని చెప్పారు. కార్మికులు, కార్యదర్శులు ప్రతి రోజు చెత్త సేకరణకు వెళ్లే సమయంలో ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. నోడల్ అధికారులు ప్రతి రోజు తమకు కేటాయించిన ప్రాంతాల్లో కార్మికుల హాజరు, క్షేత్ర స్థాయిలో పనితీరు, ప్రజల అభిప్రాయాలను పరిశీలించాలని కోరారు. వార్డుల వారీగా బ్లాక్ స్పాట్స్ లేకుండా చర్యలు తీసుకోవడంలో భాగంగా గ్రీన్ మ్యాట్‌లు, చెత్త వేయకూడదని, బ్యానర్లను ఇంజినీరింగ్ అధికారుల సమన్వయంతో ఏర్పాటు చేసినప్పటికీ కొన్ని ప్రాంతాల్లో వ్యర్థాలు వేస్తున్నారని చెప్పారు. ఆయా ప్రాంతాల్లో గమనించి, వారికి అపరాధ రుసుం విధించాలని సూచించారు. బీఆర్ స్టేడియం పరిసరాల్లో ట్రాఫిక్‌కు అంతరాయంగా ఉన్న ఆక్రమణలను తొలగించాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. పర్యటనలో డీఈఈ నాగభూషణం, ఇంజినీరింగ్, ప్రజారోగ్య, పట్టణ ప్రణాళిక అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ పరిసరాలు..

అన్న క్యాంటీన్‌లలో ఆహారం కోసం వచ్చే వారి సంఖ్య రోజు రోజుకి పెరుగుతుందని, అందుకు తగిన విధంగా ఇండెంట్ సిద్ధం చేసుకోవడంతో పాటు పరిసరాలు పరిశుభ్రం ఉండేలా అక్షయ పాత్ర సిబ్బంది తగిన చర్యలు తీసుకోవాలని కమిషనర్ పులి శ్రీనివాసులు కోరారు. బుధవారం బస్టాండ్ దగ్గర ఉన్న అన్న క్యాంటీన్‌ను పరిశీలించారు.

వెల్ఫేర్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్ల సమస్యలపై వినతి

నెహ్రూనగర్: గ్రామ సచివాలయాల్లో సుమారు 12 వేల మందికిపైగా వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్స్ పనిచేస్తున్నారని వీరందరని వివిధ సంక్షేమ శాఖల సర్వీస్ రూల్స్ సవరణ చేసి ఖాళీగా ఉన్న పోస్టులను వీరితో భర్తీ చేయించాలని ఆంధ్రప్రదేశ్ గ్రామ, వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు షేక్ అబ్దుల్ రజాక్ కోరారు. ఈ మేరకు బుధవారం సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. పాఠశాలల్లో మరుగుదొడ్ల ఫొటోలు తీసే విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని, సంక్షేమ విద్యా సహాయకులకు డీడీఓలుగా వారి మాతృశాఖకు సంబంధించిన అధికారి ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

బయోమెడికల్ ఇంజినీర్లకు జీజీహెచ్‌లో శిక్షణ

గుంటూరు మెడికల్: సైరిక్స్ హెల్త్‌కేర్ ఆంధ్రప్రదేశ్ బయోమెడికల్ ఇంజినీరింగ్ మేనేజ్మెంట్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో బుధవారం గుంటూరు జీజీహెచ్‌లో బయో మెడికల్ ఇంజినీర్లు, ఇతర సిబ్బందికి క్యాలిబ్రేషన్ శిక్షణ నిర్వహించారు. శిక్షణలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ మాట్లాడుతూ శిక్షణ వలన వైద్య పరికరాల నాణ్యత మరియు సేవలు మెరుగు పడతాయని వివరించారు. ప్రాజెక్ట్ మేనేజర్ నాగసాయి, జిల్లా ఇన్‌చార్జి సాయి చైతన్య పర్యవేక్షించారు. 30 మంది శిక్షణకు హాజరయ్యారు.

17న బీజేపీ ఆధ్వర్యంలో తిరంగా యాత్ర

గుంటూరు మెడికల్: ఆపరేషన్ సిందూర్ విజయవంతాన్ని పురస్కరించుకుని ఈనెల 17వ తేదీన తిరంగా యాత్ర నిర్వహించనున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు బుధవారం తెలిపారు. ఉదయం 7 గంటలకు హిందూ కాలేజీ సెంటర్ నుంచి లాడ్జి సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వరకు యాత్ర సాగుతుందని చెప్పారు. బీజేపీ, జనసేన, టీడీపీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న కార్యక్రమానికి ప్రజలు హాజరుకావాలని కోరారు. యాత్రలో ఏ రాజకీయ పార్టీ జెండాలు, కండువాలు లేకుండా కేవలం జాతీయ జెండాలతో మాత్రమే ర్యాలీకి హాజరు కావాలని చెప్పారు.

వడదెబ్బతో వృద్ధుడి మృతి

లక్ష్మీపురం: వడదెబ్బతో వృద్ధుడి మృతిపై జీఆర్పీ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. గుంటూరు రైల్వే స్టేషన్‌లో ఎండ తీవ్రతకు సుమారు 75 సంవత్సరాల వృద్ధుడు బాధపడుతున్నాడు. గమనించిన రైల్వే పోలీసులు ప్రభుత్వ సమగ్రాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి చెందాడు.

ముఠా కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న ముఠా కార్మికులు

లక్ష్మీపురం: అఖిల భారత కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపులో భాగంగా ఈనెల 20వ తేదీ సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని గుంటూరు నగర ముఠా వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) ప్రధాన కార్యదర్శి కే శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. గుంటూరు స్థానిక లాడ్జి సెంటర్‌లోని బుధవారం టైల్స్ అండ్ శానిటరేషన్, బస్టాండ్ వద్ద సివిల్ సప్లై దిగుమతి ముఠా కార్మికుల జనరల్ బాడీ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లేబర్ కోడ్స్ రూపంలో కార్మిక హక్కులను హరించటం అన్యాయమని చెప్పారు. సమ్మె సందర్భంగా శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరం నుంచి లాడ్జి సెంటర్ వరకు నిరసన ప్రదర్శన జరుగుతుందని, ఈ ప్రదర్శన కార్యక్రమంలో మన ముఠా వర్కర్స్ అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశం అనంతర సివిల్ సప్లైస్ గోదాము ఇన్‌చార్జికి వినతిపత్రం అందజేశారు. సమావేశంలో జోజి, సారథి, సివిల్ సప్లైస్ ముఠా మేస్త్రి కోటయ్య, ఇర్మియ, అశోక్ ద్వారకారావు పాల్గొన్నారు.

రిటైర్డ్ డీసీపీ సత్యనారాయణపై ఆర్టికల్ చార్జెస్

టీడీఆర్ బాండ్ జారీ విషయంలో అక్రమాలు పాల్పడిన వైనం

నెహ్రూనగర్: నగరపాలక సంస్థలో డీసీపీగా(డెప్యూటీ సిటీ ప్లానర్‌గా) పనిచేస్తూ రిటైర్డ్ అయిన బి.సత్యనారాయణపై ప్రభుత్వం ఆర్టికల్ చార్జెస్ ఫ్రేమ్ చేస్తూ బుధవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సురేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. 2022లో కాకానీ రోడ్ నుంచి జాతీయ రహదారి వరకు రోడ్డు విస్తరణ పనులను నగర పాలక సంస్థ చేపట్టింది. ఈ రోడ్డు విస్తరణ పనులలో భాగంగా భవనాలు కోల్పోయిన బాధితులకు నష్టపరిహారం కింద నగదు, ఖాళీ స్థలాలకు టీడీఆర్(ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్) బాండ్లను జారీ చేశారు. దీనిపై బాధితులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన ప్రభుత్వ ఉన్నతాధికారులు అప్పటి డీసీపీ సత్యనారాయణ(రిటైర్డ్) పై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం జీఓ నంబర్ 445ను బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

ఎడాపెడా కరెంట్ కోతలు..

- లోవోల్టేజీతో ప్రజలకు అవస్థలు
- శివారు కాలనీల్లో అడ్డగోలుగా కోతలు

నెహ్రూనగర్: భానుడు ప్రతాపం చూపుతున్నాడు. వేడికి వృద్ధులు.. పిల్లలు అల్లాడిపోతున్నారు. ఇంటి నుంచి బయటకు రావాలంటే భయపడిపోతున్నారు. ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. దీనికి తోడు ఎడాపెడా విద్యుత్ కోతలు కలవరపెడుతున్నాయి. కరెంట్ ఉన్నా లోవోల్టేజీతో విద్యుత్ ఉపకరణాలు పనిచేయడం లేదు. నరకయాతన పడాల్సిన పరిస్థితి. తూర్పు నియోజకవర్గంలోని శివారు కాలనీల్లో కరెంట్ కోతలు ఎక్కువగా ఉండటంతో శివారు కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారు.

54వ డివిజన్‌లో అధికంగా కోతలు

గుంటూరు నగరంలో సంపన్నులు ఉండే ప్రాంతాల్లో ఎటువంటి కరెంట్ కోతలు, లో వోల్టేజీ సమస్యలు ఉండవు. కానీ పేద, మధ్య తరగతి కుటుంబాలు నివాసించే ప్రాంతాల్లో అడ్డగోలుగా కరెంట్ కోతలు విధిస్తూ పేద, మధ్య తరగతి ప్రజలను వేసవి కాలంలో ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఏసీల వినియోగం వినియోగం ఎక్కువగా ఉంటున్న క్రమంలో అందుకు అనుగుణంగా ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని పెంచకుండా విద్యుత్ శాఖ అధికారులు మమ్మల్ని ఇబ్బందులకు గురి చేస్తున్నారని డివిజన్ వాసులు వాపోతున్నారు.

కరెంట్ కోతలు ఎక్కువగా ఉన్నాయి

మా ప్రాంతంలో ప్రతి రోజు రాత్రి వేళల్లో కరెంట్ పోతుంది. ఉదయం అంతా పనులు చేసుకుని రాత్రి వేళ ప్రశాంతంగా పడుకుందామంటే కరెంట్ కోతలతో నిద్రపోలేని పరిస్థితి నెలకొంది. ఒక వేళ కరెంట్ ఉన్నప్పటికి లో వోల్టేజీ సమస్య వేధిస్తుంది. దీనిపై విద్యుత్ శాఖ అధికారులు స్పందించి కరెంట్ సమస్యకు పరిష్కారం చూపాలి.

–కృపయ్య, 54వ డివిజన్

ఉర్దూ లైబ్రరీని సద్వినియోగం చేసుకోవాలి



చలో ఉర్దూ లైబ్రరీ ర్యాలీని ప్రారంభిస్తున్న పాఠశాల హెచ్‌ఎం ఖాసిం

గుంటూరు ఎడ్యుకేషన్: వేసవి సెలవుల్లో విద్యార్థులు ఉర్దూ భాష నేర్చుకోవడానికి వీలుగా ఉర్దూ అకాడమీ చేపట్టిన 'చలో ఉర్దూ లైబ్రరీ' కార్యక్రమాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు షేక్ మొహ్మద్ ఖాసిం పేర్కొన్నారు. బుధవారం చౌత్రా సెంటర్లోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల నుంచి చలో ఉర్దూ లైబ్రరీ ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఖాసిం మాట్లాడుతూ విద్యార్థులు వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవడానికి వీలుగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమం ఎంతో ప్రయోజనకారి అని, ఉర్దూ భాష నేర్చుకోవడంతో ఉజ్వల భవిష్యత్ ఉందని అన్నారు. యునానీ డాక్టర్ కోర్సు నేర్చుకోవడంలో ఉర్దూ భాష నేర్చుకోవడం తప్పనిసరి అని, ఇటువంటి బహుళ ప్రయోజనాలు ఉన్న ఉర్దూ భాష నేర్చుకోవాలని సూచించారు. ఆసక్తి కల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. వేసవి సెలవులను వృథా చేసుకోకుండా తమ పిల్లలను ఉర్దూ అకాడమీ లైబ్రరీలకు పంపించాలని తల్లిదండ్రులను కోరారు. కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ లైబ్రరీ సిబ్బంది షేక్ అక్బర్ రఫీ, ఫక్రుద్దీన్, అబ్దుల్లా మహిమున్నీసా మల్లికా, నాగూర్ భాషా, జిలానీ పాల్గొన్నారు.

శలపాడులో స్వచ్ఛతపై సమీక్ష

చేబ్రోలు: మండలంలోని శలపాడు గ్రామంలో పారిశుద్ధ్యం మెరుగుదలకు అందరి సహకారంతో కృషి చేయనున్నట్లు ఎంపీడీవో ఎ.ఉమాదేవి తెలిపారు. బుధవారం సాక్షి దినపత్రికలో 'శలపాడు.. చెత్తే ఎటు చూడు' శీర్షికన ప్రచురితమైన కథనానికి ఆమె స్పందించారు. ఈవోపీఆర్డీ ఉషారాణి, ఎస్ఆర్ జీఎస్ టెక్నికల్ అసిస్టెంట్ రసూల్‌తో కలిసి ఆమె గ్రామంలో పర్యటించారు. ప్రధాన రహదారి పక్కన మార్జిన్లలో చెత్తాచెదారాలను వేయవద్దని సమీక్ష నిర్వహించారు. చెత్త సంపద కేంద్రంకు తరలించాలని ఎంపీడీవో ఆదేశించారు. కొండంబట్ల చెరువు అభివృద్ధికి కృషి చేయనున్నట్లు తెలిపారు. పంచాయతీ కార్యదర్శి శ్రీలత, ఉపాధిహామీ సిబ్బంది, మండల కోఆర్డినేటర్ జి.ప్రసాద్ పాల్గొన్నారు.

ముగిసిన ప్రవచన కార్యక్రమం



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికగా రెండు రోజులుగా జగత్ గురువు శ్రీశంకరాచార్యులు రచించిన మాతృదేవోభవ అనే అంశంపై నిర్వహిస్తున్న ప్రవచన కార్యక్రమం బుధవారం ముగిశాయి. ఆలయ పాలకమండలి ఉపాధ్యక్షులు లంకా విజయ బాబు, ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, సహ కార్యదర్శి వూటుకూరి నాగేశ్వరరావు జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. సుందర సత్సంగ్ సభ్యులు, శ్రీసుందర చైతన్యానందస్వామి శిష్యులు కేవీ కోటేశ్వరరావు మాట్లాడుతూ జీవితంలో తల్లికి మించింది ఏమిలేదన్నారు. పుడమి తల్లి కంటే పుట్టుకనిచ్చిన తల్లే గొప్పది అన్నారు. వర్షించే నింగి కన్నా వాత్సల్యాన్ని కురిపించే తండ్రి గొప్పవాడని పేర్కొన్నారు. తల్లిదండ్రుల సేవలో మాధవ సేవ ఉందని, వారిని ఉన్నతులుగా భావించి భక్తి శ్రద్ధలతో సేవించాలన్నారు. కార్యక్రమంలో సుందర సత్సంగ్ సభ్యులు మన్నవ రవిప్రసాద్, పి.శివారెడ్డి, చెన్నకేశవరావు, ఏకాంబరేశ్వరరావు పాల్గొన్నారు.

'అమ్మ'పై జాలి చూపలేదు..

- జీజీహెచ్‌లో క్యాజువాల్టీ వద్దకు వచ్చినా పట్టించుకోలేదు
- సోషల్ మీడియాలో విమర్శలు రావడంతో చలనం



జీజీహెచ్‌లోని క్యాజువాల్టీ వద్ద పడి ఉన్న వృద్ధురాలు

గుంటూరు మెడికల్: అమ్మపై కనికరం లేదు. అమ్మకు ఎంత కష్టం వచ్చింది. మన జన్మంతా ఉడిగం చేసిన రుణం తీర్చుకోలేం. మనకు జన్మనిచ్చేందుకు ఆమె పడే కష్టం మాటలు చెప్పలేం. కానీ వృద్ధాప్యంలో ఉన్న తల్లి గుంటూరు జీజీహెచ్‌లో క్యాజువాల్టీకి వస్తే పట్టించుకునే నాథుడే లేకుండా పోయారు. ఉదయం నుంచి రాత్రి వరకు కదలేని స్థితిలో పడిఉంది. ఆస్పత్రికి చికిత్స కోసం వచ్చిన పలువురు రోగుల బంధువులు సోషల్ మీడియా ద్వారా ఈ విషయాన్ని వైరల్ చేయడంతో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ స్పందించారు. వృద్ధురాలిని క్యాజువాల్టీలో చేర్చి చికిత్స అందించాలని సిబ్బందిని ఆదేశించారు. అయినప్పటికీ రాత్రి 11 గంటల వరకు అదే స్థితి కొనసాగింది. మంగళవారం ఈ తంతు ఆస్పత్రిలో జరిగింది. ఎట్టకేలకు బుధవారం ఉదయం వృద్ధురాలిని క్యాజువాల్టీలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు.